# విడాకుల నేపథ్యంలో సమ్మతమైన విషయాలు

## 97వ అంశం : నికాహ్ తరువాత సమాగమం జరపక ముందే విడాకులివ్వవచ్చు.

"ఒకవేళ మీరు స్త్రీలను తాకకుండా, వారి మహర్‌ను నిర్ధారించకుండానే వారికి విడాకులిస్తే అది కూడా మీకు పాపం కాదు. అయితే వారికి ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చండి. స్థితిమంతుడు తన స్థితికి తగినట్లుగా, పేదవాడు తన స్థోమతకు తగినట్లుగా ధర్మం ప్రకారం ప్రయోజనం చేకూర్చాలి. ఉత్తమంగా వ్యవహరించేవారికి ఇది విధిగా నిర్ణయించబడింది."

(అల్ బఖర - 236)

## 98వ అంశం : షరతులతో కూడిన తలాఖ్ గానీ, అనిశ్చితితో కూడిన తలాఖ్ గానీ ఇవ్వవచ్చు

హ్జ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "ముస్లింలు తమ షరతులకు కట్టుబడి ఉండాలి."(అబూదావూద్-3594 హసన్)[1]

వివరణ: ఉదాహరణకు: భర్త తన భార్యతో 'నువ్వు గనక గడప దాటావంటే నీకు తలాఖ్' అని అన్నాడనుకోండి- అట్టి తలాఖ్ షరతులతో కూడిన తలాఖ్ అవుతుంది. భార్య అతని మాటను లక్ష్యపెట్టకుండా ప్రవర్తిస్తే (అంటే అతను విధించిన షరతును జవదాటితే) విడాకులైపోయినట్లే.

## 99వ అంశం : విడాకుల విషయంలో భార్యకు నిర్ణయాధికారం ఇవ్వటం సమ్మతమే.

హ్జ్రత్ ఆయిషా (ర.అన్హా) తెలిపారు: "దైవప్రవక్త (స) మాకు నిర్ణయాధికారం ఇచ్చారు. మేము మాత్రం (విడాకులకు ప్రతిగా) దైవప్రవక్త (స)నే ఇష్టపడ్డాము. అందువల్ల ఆయన(స), తన మాటలను తలాఖ్‌గా లెక్కించలేదు." (అబూదావూద్-2203.సహీహ్)[2]

వివరణ: నువ్వు నాతో కాపురం చెయ్యదలిస్తే చెయ్యవచ్చు లేదా విడిపోవచ్చు అని భర్త తన భార్యతో అంటే ఆమెకు నిర్ణయాధికారం ఇచ్చినట్లవుతుంది. ఆమె గనక భర్తతోనే ఉండదలిస్తే విడాకులవవు. ఒకవేళ ఆమె విడిపోదలిస్తే మాత్రం విడాకులైపోతాయి.

## 100వ అంశం : భార్య గర్భవతిగా ఉన్నప్పుడు విడాకులివ్వటం సమ్మతమే

హ్జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) కథనం: ఈయన తన భార్యకు బహిష్టు స్థితిలో విడాకులిచ్చారు. హ్జ్రత్ ఉమర్(రజి) ఈ సంగతిని దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించగా ఆయన(స) ఇలా ఉపదేశించారు: "తన భార్యను తిరిగి రప్పించుకోమని అబ్దుల్లాహ్‌కు చెప్పండి. ఆ తరువాత ఆమెకు విడాకులివ్వగోరితే ఇవ్వవచ్చు - ఆమె పరిశుద్ధ స్థితిలో ఉన్నాసరే, గర్భవతిగా ఉన్నాసరే."[3] (అబూదావూద్ 2181, ఇబ్నుమాజ 2023. సహీహ్ హదీసు)

---

*1. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ, రెండవ భాగం- హ.నెం.3023*

*2. సహీహ్ సుననె అబీ దావూద్ లిల్ అల్‌బానీ, రెండవ భాగం- హ.నెం.1929*

*3. సహీహ్ సుననె ఇబ్నుమాజా లిల్ అల్‌బానీ, మొదటి భాగం - హ.నెం.1643*